
కథ



# కుట్ర

వేంపల్లి రెడ్డి నాగరాజు

రాష్ట్రప్రభుత్వంలోని ఓ శాఖలో చిన్న వయస్సులోనే అధికారిగా ఉద్యోగం తెచ్చుకున్న రమేశ్, మంచి పేరున్న వర్తమానకథా రచయిత.

ఆఫీసు నుండీ బయటపడగానే, సాయంకాలం వేళల్లో కాలక్షేపం కోసం అన్నట్లుగా ప్రారంభించిన కథారచన. అతడిని కేవలం నాలుగేళ్లలోనే అగ్రస్థాయి రచయితల సరసన కూర్చోబెట్టింది.

ప్రారంభదశలోనే రమేశ్ పంపిన పది దాకా కథల్లో ఏ ఒక్కటీ తిరిగి టపాలో రాకుండా వరుసగా అచ్చవడం, పైగా ఆ పత్రికలన్నీ ఇది వరకే విశేషజనాదరణ పొందిన పత్రికలు కావడంతో, అతడి కలానికి ఎదురే లేకుండా పోయింది.

దీంతో కేవలం తీరిక వేళలు, ఆదివారాల్లో మాత్రమే కొనసాగించే తన రచనాప్రక్రియను మరింతగా విస్తారం చేసి, ప్రతిరోజూ అర్ధరాత్రి వరకూ తెల్ల కాగితాల్ని నల్లగా చేయడానికి పూనుకున్నాడు.

అదృష్టం అవగింజంత వున్నా చాలన్నట్లుగా కొన్ని పత్రికలు వివిధసందర్భాలలో నిర్వహించిన పోటీల్లో రమేశ్ కథలు ప్రథమ, ద్వితీయబహుమతులకు ఎంపికై వేలాది రూపాయల సొమ్ము సమకూర్చిపెట్టాయి.

ప్రముఖవార-మాసపత్రికలతో పాటుగా దినపత్రికల ప్రత్యేక అనుబంధాల్లో సైతం ప్రచురితమవుతున్న అతడి కథలు, వాసిలోనే గాక రాశిపరంగా కూడా ఎక్కువగానే వుండడం, అప్పటికి ముప్పై ఏళ్లుగా సీరియస్ కథారచయితలుగా కొనసాగుతున్నవారిని, దిమ్మెరపోయేలా చేసింది.

రచయితగా కనీసం నాలుగేళ్ల అనుభవం కూడా లేని రమేశ్ కథలకే, పత్రికలన్నీ పట్టం గట్టి ప్రైజులిస్తుండడం, పాఠకుల్లో రోజు రోజుకూ జనాదరణ పెరిగిపోతుండడం, ఒకరిద్దరు రచయితలకు కంటగింపుగా కూడా మారింది.

తొలినాళ్లలో సలహాలు, సూచనల కోసం వాళ్ల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోని అగ్రశేణి రచయితలు, ఇప్పుడు రమేశ్‌ను తమంతట తాముగానే ఫోన్‌లో పలకరించడం, సాహిత్య సభల్లో కలిసినప్పుడు అభినందించడం, తప్పనిసరి పరిపాటిగా మారింది.

రమేశ్ పని చేసే ఆఫీసులో, అతడి స్థాయిలోనే పని చేసే కనకారావు, మంచి సాహిత్యాభిలాషి. ప్రతినెలా జీతం డ్రా చెయ్యగానే కనీసం నాలుగు వందలైనా వివిధవార-మాసపత్రికల కొనుగోలు కోసం ఖర్చు పెట్టేంత సాహిత్యాభిలాష గల కనకారావు, తను రమేశ్ మంచి రచయిత పని చేసే ఆఫీసులోనే వున్నందుకు ఓ రకంగా గర్విస్తుంటాడు. మరో రకంగా మరిన్ని మంచి రచనలు చేయమని, జాతీయ-అంతర్జాతీయస్థాయిలలో పేరు తెచ్చుకునేందుకు అవసరమైన కృషి చేయమని చెవినిల్లు కట్టుకుని పోరు పెట్టి ప్రోత్సహిస్తుంటాడు కూడా.

విదేశాలలోని ఓ తెలుగు సంఘం, ఆ ఏడాది ఓ ప్రత్యేకసందర్భంలో నిర్వహించిన కథల పోటీల్లో, సుమారు వెయ్యిమంది దాకా రచయితలు పాల్గొన్నా, ఈ సారి కూడా యాభైవేల రూపాయల ప్రథమబహుమతి రమేశ్‌కే దక్కింది.

దీంతో ప్రథమబహుమతి తమనే వరిస్తుందని ఎంతో నమ్మకంతో వున్న పలువురు రచయితలు 'అందని ద్రాక్ష పండు పుల్లన' చందంగా, కథల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలుగా ఎవరు వ్యవహరిస్తారనే విషయాన్ని ముందుగానే పసిగట్టి, రమేశ్ వారితో "ముందస్తు" ఒప్పందాలు చేసుకుంటాడనే వ్యాఖ్యలు చేసినట్లు అ నోటా ఆ నోటా వినవచ్చింది. ఇదే విషయమై పుకార్లు కూడా షికారు చేశాయి.

ఏది ఏమైనా, బహుమతి సొమ్ము రావడంతోటే తమకు గ్రాండ్‌గా పార్టీ ఇవ్వాలని పట్టుబట్టారు, ఆఫీస్ కొలీగ్స్. బిస్కట్లు, కాఫీలతో సరిపుచ్చితే వూరుకునేది కూడా లేదని సరదాగా హెచ్చరించారు కూడా. కనకారావు కూడా సిబ్బంది డిమాండ్‌కే మద్దతు పలకడంతో, సొమ్ము చేతికి రాగానే పార్టీ ఇస్తానని ఒప్పుకున్నాడు రమేశ్.

ఈ పోటీ కోసం కథ రాయమని ఎంతగానో పోరు పెట్టడమే గాక, తనకు కాస్తంత తీరిక కలిగించడానికి అన్నట్లుగా తన పని కూడా నేనే చేస్తానని తాను మోయాల్సిన ఆఫీసు బరువుబాధ్యతలన్నీ పంచుకున్న కనకారావును మాత్రం, ఆ రోజు రాత్రి డిన్న

ర్‌కు ఆహ్వానించాడు.

భార్యాపిల్లలతో కలిసి డిన్నర్‌కు వచ్చిన కనకారావు. తిరిగి ఇంటికి వెళ్లబోయేముందు పిచ్చాపాటీ మాట్లాడుతూ, "రమేశ్ నువ్వు కథలు రాయడం, అవి పత్రికలలో అచ్చుకావడం, బహుమతులకు ఎంపిక కావడం ఇదంతా అందరూ చేసే పనే, కాకుంటే నీకంటూ ప్రత్యేకమైన గుర్తింపు వచ్చే విధంగా ఇదే రంగంలో మరో రకంగా కృషి చెయ్యరాదూ?" అన్నాడు.

అర్థం కానట్లుగా చూశాడు రమేశ్. "మనం పుట్టిపెరిగిన వాతావరణంలోని సంఘటనలను, అనుభవాలను మన భాషలో కథలుగా రాయడం మామూలు విషయమే, దీనికి కాస్తంత భిన్నంగా, ఇతరభాషల్లో ప్రసిద్ధులైన రచయితల కథలను మన భాషలోకీ, మన భాషలోని గొప్ప కథలను ఇతరభాషలకూ అనువదించడమే ప్రత్యేక కృషి చేయడమంటే" విపులంగా విశదీకరిస్తున్నట్లు చెప్పాడు కనకారావు.

సహోద్యోగి ఇచ్చిన ఈ సలహా నచ్చినట్లుగా అనిపించడంతో, సరేనన్నాడు రమేశ్. "నావంతు ప్రయత్నం చేస్తా"నన్నాడు.

> ఏది ఏమైనా, బహుమతి సొమ్ము రావడంతోటే తమకు గ్రాండ్‌గా పార్టీ ఇవ్వాలని పట్టుబట్టారు, ఆఫీస్ కొలీగ్స్. బిస్కట్లు, కాఫీలతో సరిపుచ్చితే వూరుకునేది కూడా లేదని సరదాగా హెచ్చరించారు కూడా. కనకారావు కూడా సిబ్బంది డిమాండ్‌కే మద్దతు పలకడంతో, సొమ్ము చేతికి రాగానే పార్టీ ఇస్తానని ఒప్పుకున్నాడు రమేశ్.
>
> ఈ పోటీ కోసం కథ రాయమని ఎంతగానో పోరు పెట్టడమే గాక, తనకు కాస్తంత తీరిక కలిగించడానికి అన్నట్లుగా తన పని కూడా నేనే చేస్తానని తాను మోయాల్సిన ఆఫీసు బరువుబాధ్యతలన్నీ పంచుకున్న కనకారావును మాత్రం, ఆ రోజు రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించాడు.

ఇంటర్మీడియట్, డిగ్రీ, చదువుకునే రోజుల్లో కాలేజీలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వపుపోటీల్లో గెలుపొందిన సందర్భాలలో 'నెల రోజుల్లో హిందీ, నలభై రోజుల్లో కన్నడం, రెండు వారాల్లో తమిళం' వంటి పుస్తకాలను ఔపోసన పట్టిన అనుభవం, రమేశ్‌కు ఎంతో వుంది. తను పుట్టి పెరిగిన, ఉద్యోగం చేస్తున్న ఊరు ఓ ప్రముఖ యాత్రాస్థలం కావడంతో, అక్కడికి వచ్చే వివిధరాష్ట్రాలకు చెందిన ప్రజలు మాట్లాడే తీరు, వారి జీవనశైలి ఇదివరకే గమనించివున్నాడు.

కనకారావు సలహా కాదనడం ఎందుకన్నట్లుగా రమేశ్, ఆ మరుసటి రోజు నుంచే అనువాదరచనలకు శ్రీకారం చుట్టాడు.

పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కూడా తన సబ్జెక్ట్ ఇంగ్లీష్ లిటరేచర్ కావడంతో రమేశ్ పని మరింత సులువయ్యింది. ఆ రంగంలో కూడా కేవలం రెండు నెలల వ్యవధిలోనే సుమారు ఎనిమిది దాకా అనువాదకథలు ప్రచురితం కావడంతో అనువాదరచయితగా కూడా రమేశ్ కీర్తిప్రతిష్ఠలు మరింత పెరిగాయి.

ఈ లోగా విదేశీ తెలుగు సంఘం వాళ్ల నుండి బహుమతి సొమ్ము అందడంతో, ఆఫీసు స్టాఫ్ అందరికీ డిన్నర్ ఇచ్చే రోజును ప్రకటించాడు. స్థానికంగా వున్న తెలిసిన రచయితలను కూడా డిన్నర్‌కు ఆహ్వానిస్తే బావుంటుందని ప్రతిపాదించాడు, కనకారావు.

అతడి సలహా మేరకు, నగరంలోని సాహితీ సమితి సభ్యులైన రచయితలనూ, కవులనూ వ్యక్తిగతంగా కలిసి, డిన్నర్‌కు రావలసిందిగా ఆహ్వానించాడు రమేశ్.

తమ కార్యాలయంలో పని చేస్తున్న రమేశ్, గొప్ప రచయితగా పేరుప్రఖ్యాతులు గడించి తమ శాఖకే గర్వకారణమైనందున, డిన్నర్ కార్యక్రమం రోజున, తామంతా యథాశక్తి అతడిని సన్మానించేందుకు ఓ చిన్న సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లుగా చెప్పారు, సిబ్బంది.

సన్మానసత్కారాలు ఏ మాత్రం అవసరం లేదని ముందుగా ఒప్పుకున్నా, తరువాత అందరి బలవంతం మేరకు అంగీకరించాడు రమేశ్.

రాజధాని స్థాయిలో తన శాఖలో అత్యున్నత అధికారం హోదాలో పని చేస్తున్న అధికారి చేతుల మీదుగా, రమేశ్‌ను సన్మానింపజేయాలనే తలంపుతో, ఆ బాధ్యతలను తన భుజాలకెత్తుకున్నాడు కనకారావు.

చురుగ్గా జరిగిన ఏర్పాట్ల మధ్య ముందుగానే నిర్ణయించుకున్న ప్రకారం, సన్మానకార్యక్రమం ప్రారంభమయ్యింది. లబ్ధప్రతిష్ఠులైన రచయితలూ, కవులూ ప్రతి ఒక్కరూ రావడంతో, ఒకరిని గొప్పగా, మరొకరిని తక్కువ చేసినట్లుగా "ఫీల్" అవుతారన్న ఉద్దేశ్యంతో 'ముఖ్య అతిథి, గౌరవ అతిథి, విశిష్ట అతిథి, ఆత్మీయ అతిథి' వంటి హోదాలతో వారందరినీ వేదిక మీద ఆసీనులయ్యేట్లు చేయడంలో సఫలీకృతుడయ్యాడు, కనకారావు.

కార్యక్రమానికి హాజరైన రాజధాని స్థాయి అధికారితో పాటు, ఉచితాసనాలను అధిరోహించిన అతిథులందరూ, స్వల్పకాలంలోనే రచయితగా రమేశ్ సాధించిన ఘనత గురించి పొగడ్తల వర్షం కురిపించారు.

ప్రెస్ ఫోటోగ్రాఫర్ల కెమెరాల ఫ్లాష్ మెరుపుల మధ్య, ఆహూతుల కరతాళధ్వనుల మధ్య, రమేశ్‌కు జరగాల్సిన సన్మానకార్యక్రమం అట్టహాసంగా ముగిసింది.

డిన్నర్ కార్యక్రమం ప్రారంభం కావడంతో, ఎవరికీ ఏలోటు రాకుండా రమేశ్, కనకారావు, తామే దగ్గర వుండి మరీ వడ్డనలు చేశారు.

డిన్నర్ ప్రోగ్రాం ముగియనుండగా... కార్యక్రమానికి హాజరై 'విశిష్ట అతిథి' హోదాలో గౌరవం పొందిన మధుసూదన్ అనే సీనియర్ రచయిత, రమేశ్‌ను సమీపించి, "డిన్నర్ ఐటమ్స్ అన్నీ చాలా బాగున్నాయయ్యా!" అన్నాడు కిళ్లీ నములుతూ.

"పిలవగానే వచ్చినందుకు చాలా థ్యాంక్స్ సార్!" అన్నాడు రమేశ్, వినయంగా చేతులు జోడిస్తూ.

పాతికేళ్లుగా నగర సాహితీసమితి ప్రధానకార్యదర్శి పదవిని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న మధుసూదన్ లాంటి 'చెయ్యి తిరిగిన' రచయిత, తనను వ్యక్తిగతంగా అభినందించడంతో పొంగిపోయాడు రమేశ్.

"ఈ మధ్య అనువాదాలు కూడా ప్రారంభించినట్లున్నావే?" ప్రశ్నించాడు మధుసూదన్.

"అవును సార్" బదులిచ్చాడు రమేశ్.

"నువ్వు గనక ప్రయత్నిస్తే సినిమా కథారచయితగా కూడా చరిత్ర తిరగరాస్తావయ్యా!" హనుమంతుడికి తెలియని తన బలాన్ని వానరరాజు గుర్తు చేస్తున్నట్లుగా అన్నాడు మధుసూదన్.

"మీలాంటి పెద్దల ఆశీర్వాదం సార్" మళ్లీ చేతులు జోడిస్తూ బదులిచ్చాడు రమేశ్.

"నిన్ను కలవడానికి ఓ నెల రోజుల నుండీ ప్రయత్నిస్తూనే వున్నా, ఎందుకో కుదరట్లేదయ్యా" చెప్పాడు మధుసూదన్.

'ఎందు'కన్నట్లుగా చూశాడు రమేశ్.

"గతంలో వివిధపత్రికల్లో అచ్చయిన నా రచనల్లో కొన్నింటిని నీ చేత అనువదింపజేద్దామనుకుంటున్నానయ్యా!" మళ్లీ చెప్పాడు మధుసూదన్, భుజానికి వేలాడుతున్న సంచిలో నుండి తీసిన ఓ కాగితాల బొత్తిని రమేశ్ చేతుల్లో పెడుతూ. ఓ నెల రోజుల్లోగా పనిని పూర్తి చేయమన్నట్లుగా కూడా కోరాడు.

సరేనన్నాడు రమేశ్.

అప్పటికే బాగా పొద్దుపోవడంతో అందరూ ఇళ్లకు దారితీశారు.

మరుసటి రోజు ఆదివారం కావడంతో, తనకు ఓ ప్రముఖ పబ్లికేషన్‌కు చెందిన పబ్లిషర్ నుండి నవల రాయమంటూ వచ్చిన 'ఆఫర్'ను కూడా తాత్కాలికంగా పక్కన పెట్టి, మధుసూదన్ రచనలను అనువాదం చేసే కార్యక్రమానికి 'శ్రీకారం' చుట్టాడు రమేశ్. నెల రోజుల గడువు లోగా పూర్తి చేసే ఉద్దేశ్యంతో, ప్రతి రోజూ అర్ధరాత్రి వరకూ మేల్కొని, మళ్లీ ఉదయం నాలుగింటికే నిద్రలేవడం, కొన్నాళ్లపాటు ఆఫీసుకు సెలవు పెట్టి, ఎట్టకేలకు 'పని' పూర్తి చేశాడు.

అనుకున్న గడువు లోగా పని పూర్తిగావడంతో, పాటు మధుసూదన్ వంటి ప్రముఖరచయిత కథల్ని అనువాదం చేసిన అవకాశం తనకే దక్కిందన్న సంతృప్తితో, ఓ రోజు సాయంత్రం అతడిని కలిసేందుకు తానే మధుసూదన్ ఇంటికి వెళ్లాడు రమేశ్.

కాలింగ్ బెల్ మోగడంతో తలుపు తీసిన కుర్రాడు, 'ఎవరు కావాలి?' ఉన్నట్లుగా చూశాడు.

తాను మధుసూదన్ గారిని కలిసేందుకు వచ్చినట్లు చెప్పాడు రమేశ్. డాబా పైకి వెళ్లే మెట్ల వైపు దారి చూపించాడు పని కుర్రాడు.

పైకి వెళ్లిన రమేశ్, అక్కడి వాతావరణాన్ని చూసి వెనుదిరగబోయాడు.

ఎవరో వచ్చినట్లుగా చప్పుడు కావడంతో, సీనియర్ కథారచయితలుగా పేరుపొందిన సాహితీసమితి అధ్యక్షుడు ప్రభాకర్‌తో, సంయుక్తకార్యదర్శి విశ్వనాథంతో కలిసి "విస్కీ" సేవనం చేస్తున్న -ధుసూదన్ "రావయ్యా రమేశ్" అన్నాడు.

అప్పటికే నిషా తలకెక్కి వుండడంతో, మాటలు ముద్దగా వస్తున్నాయి.

"మరోసారి వస్తానండి" అంటూ మెట్లు దిగబోయిన రమేశ్‌ను వారించాడు విశ్వనాథం, తమతో కలిసి మందు కొట్టేందుకు రమ్మన్నట్లుగా ఆహ్వానిస్తూ.

"ఇలాంటివి నాకలవాటు లేదండీ" చెప్పాడు రమేశ్.

"ఏదైనా ఒకసారి మొదలుపెడితేనే కదయ్యా అలవాటయ్యేది!" గ్లాసులో ద్రవాన్ని కళ్లు మూసుకుని ఖాళీ చేస్తూ అన్నాడు ప్రభాకర్, తను వేసిన 'జోక్'కి తనే పగలబడి నవ్వుతూ.

ఆ వాతావరణం రమేశ్‌కు భరించరాని కంపరం పుట్టిస్తోంది.

"చేతిలోని ఆ కాగితాలు ఏమిటయ్యా రమేశ్?" ప్రశ్నించాడు మధుసూదన్.

"అనువాదం చేసిన మీ కథల తాలూకు కాగితాలండీ" చెప్పాడు రమేశ్.

"ఆ కాగితాలన్ని మా పనికుర్రాడికిస్తే జాగ్రత్త చేస్తాడు గాని, మన విశ్వనాథం కూడా తన రచనలన్నీ నీ చేత అనువాదం చేయించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాడయ్యా రమేశ్" అన్నాడు మధుసూదన్ పగలబడి నవ్వుతూ.

"మరోసారి కలుస్తానండీ" అంటూ మెట్లు దిగి, కాగితాలన్నీ పనికుర్రాడికి అందించి, 'తాను ఈ సమయంలో పొరపాటుగా వచ్చానా' అని మథనపడుతూనే స్కూటర్‌పై ఇంటికి వెళ్లిపోయాడు, రమేశ్.

చేతిలోని సిగరెట్‌ను గుండెల నిండుగా పీల్చి, పొగను రింగులుగా గాలిలోకి వదులుతున్న మధుసూదన్ వైపు అయోమయంగా చూస్తూ, "నా రచనలన్నీ రమేశ్ చేత అనువాదం చేయించుకోవాలని నీకెప్పుడు చెప్పాను?" అడిగాడు విశ్వనాథం.

"ఈ మధ్య గల నెల రోజులుగా కనీసం ఓ పత్రికలోనైనా రమేశ్ పేరు కనిపించిందా?" అడిగాడు మధుసూదన్.

"నువ్వు రమేశ్‌తో అన్నదానికీ, ఇప్పుడు చెబుతున్నదానికీ పొంతన ఏమిటో నాకు అర్థం గావడం లేదు" అన్నాడు విశ్వనాథం.

"ఆ రమేశ్‌గాడు మరింతగా రెచ్చిపోయి కథలు రాస్తూ, మన చిరునామాలు చెరిపేస్తాడన్న భయంతో, మా గురువుగారే ఈ ప్లాన్ వేశారు" చేతిలోని ఖాళీ గ్లాసు కిందపెడుతూ, మధుసూదన్ వంక ఆరాధనగా చూస్తూ చెప్పాడు ప్రభాకర్.

"మీరు మాట్లాడుతున్నదేమిటో నాకు బొత్తిగా అర్థం కావటం లేదు" అన్నాడు మళ్లీ విశ్వనాథం.

"వాడికి ఏ మాత్రం అనుమానం రాకుండా, వాడి కంటిని వాడి వేలితోనే పొడిపించినట్లుగా, ఖాళీ సమయం అనేది లేకుండా చేయడానికి, తన సొంత రచనలపై దృష్టి సారించకుండా ఈ అనువాదాల కార్యక్రమం అప్పగించాను విశ్వనాథం!" విడమరిచి చెప్పాడు మధుసూదన్, తన గారపళ్లు కనిపించేలా బిగ్గరగా నవ్వుతూ. రమేశ్‌లోని వర్తమాన రచయితను 'కుట్ర' ప్రకారం ఎలా నాశనం చేస్తున్నాడనే విషయాన్ని వివరిస్తూ.

"ఎంతైనా మీ బుర్రే బుర్రండీ! ముల్లును ముల్లుతోనే, వజ్రాన్ని వజ్రంతోనే అన్నట్లుగా, ఆ రమేశ్ గాడి కలం దూకుడును వాడి కలంతోనే నిరోధించగలుతున్నారు గానీ..."

అసలు 'మెలిక' అర్థం అవుతుండగా మధుసూదన్ వైపు ప్రశంసగా చూస్తూ అన్నాడు విశ్వనాథం.

"మరో ఏడాది పాటు మనందరి రచనలను ఇలాగే అనువాదాల పేరిట వాడికి అప్పగిస్తూ పోతే సరిపోతుందేమో!" మరోసారి గ్లాస్ ఖాళీ చేస్తూ చెప్పాడు మధుసూదన్.

మళ్లీ అర్థం కానట్లు చూశాడు విశ్వనాథం.

"మనం చెప్పిన పని తన వల్ల కాదంటే మనం ఏమనుకుంటామోనన్న మొహమాటంతోనూ, మనపై వున్న గౌరవంతోనూ తన సొంత రచనలపై ధ్యాస పెట్టే అవకాశమే లేదయ్యా విశ్వనాథం!" కొనసాగింపుగా చెప్పాడు ప్రభాకర్, ఇకైనా అర్థమైందా అన్నట్లుగా చూస్తూ.

"ఆ రమేశ్‌కు క్షణం తీరిక లేకుండా వాడిని పత్రికలకు దూరం చేస్తున్న మీ ఘనతకు జోహార్లండీ బాబూ!" గ్లాసులోని ద్రవం బట్టలపై ఒలుకుతున్నా పట్టించుకోకుండా సాగిలబడ్డాడు విశ్వనాథం.

"పొగడ్తలు చాలు గాని, అనువాదం చేసేందుకు నీ రచనలన్నీ ప్రఖ్యాతరచయిత రమేశ్‌గారికి ఎప్పుడు అందజేస్తున్నావు?" విశ్వనాథాన్ని ప్రశ్నించాడు మధుసూదన్, ప్లేట్లోని వేయించిన జీడిపప్పును చేతిలోకి తీసుకుంటూ.